సాక్షి సిద్దిపేట

శనివారం । 18 । ఫిబ్రవరి । 2023



మహదేవుని నెలవు.. శనీశ్వరుని కొలువు

వర్గల్ శంభునిగిరిపై శనివారం మహాశివరాత్రి నేపథ్యంలో అభిషేకాలు, శనిత్రయోదశిలో భాగంగా తైలాభిషేకాలు చేసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. 8లో..



సీసీ ఫుటేజీ ఆధారంగా విచారణ

సీసీ ఫుటేజీ ఆధారంగా మెదక్ పోలీసులు జరిపిన తీరు వివాదాస్పదమవుతోంది. ఈ విషయంపై ఖదీర్ భార్య శుక్రవారం ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. 8లో..



ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేట్‌కట్ చేసి ఘనంగా నిర్వహించారు. 9లో..

మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు

- తొలివిడతలో నాలుగు మండలాలు, మున్సిపాలిటీలు
- జిల్లా వ్యాప్తంగా 245 చోట్ల ఏర్పాటు
- రుణంతో పాటు సబ్సిడీ అవకాశం
- ఐదేళ్ల వరకు నిరంతర విద్యుత్ ఉత్పత్తి
- మిగులు కరెంట్‌ను గ్రిడ్‌కు అమ్ముకునే వెసులుబాటు

సాక్షి, సిద్దిపేట: విద్యుత్ చార్జీల భారంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఇబ్బందులను దూరం చేసేందుకు ప్రభుత్వం సంప్రదాయేతర ఇంధన వనరులను చేరువ చేస్తోంది. గ్రామాల్లో మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు రుణాలు అందించేందుకు నిర్ణయించింది. స్త్రీనిధి పథకం కింద ప్లాంట్లను ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన రుణ సదుపాయంతో పాటు సబ్సిడీని కూడా అందించనుంది. ఒక్కో మండలానికి 35 యూనిట్ల చొప్పున నాలుగు మండలాలకు, నాలుగు మున్సిపాలిటీలో కలిపి తొలివిడతలో సిద్దిపేట జిల్లాలో 245 యూనిట్లను మంజూరు చేసింది.



సిద్దిపేటలో ఓ ఇంటిపై సోలార్ ప్లాంట్ (ఫైల్)

జిల్లా వ్యాప్తంగా..

- జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద తొలుత నాలుగు మున్సిపాలిటీలు, నాలుగు మండలాలకు సోలార్ యూనిట్లను మంజూరు చేయాలని నిర్ణయించారు.
- సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్ మున్సిపాలిటీలతో పాటు అక్కన్నపేట, బెజ్జంకి, కోహెడ, నంగునూరు మండలాల్లో వీటిని అందించేందుకు ప్రణాళికను రూపొందించారు.
- ఆయా మున్సిపాలిటీలు, మండలాల పరిధిలో 7,943 మహిళా సంఘాలుండగా 86,259 మంది సభ్యులున్నారు.
- ఒక్కో మండలానికి 35 యూనిట్లు, మున్సిపాలిటీలకు 26 చొప్పున కలిపి జిల్లా వ్యాప్తంగా 245 యూనిట్లు మంజూరు చేయనున్నారు.
- సౌర విద్యుత్ వినియోగం, మిగులు విద్యుత్‌ను డిస్కంలకు సరఫరా చేయడం ద్వారా కలిగే ఆర్థిక ప్రయోజనాలపై సంఘాల సభ్యులకు అవగాహన సైతం కల్పిస్తున్నారు.

2, 3 కేవీ ప్లాంట్లు..

- సోలార్ ప్లాంట్ల ఏర్పాటులో 2 కేవీ, 3 కేవీ యూనిట్లు ఉన్నాయి. ఇందులో లబ్ధిదారులు ఎంపిక చేసుకున్న యూనిట్లను బట్టి వారికి స్త్రీనిధి సంస్థ రుణ సాయం అందిస్తుంది.
- 2కిలో వాట్ల యూనిట్‌కు రూ.1,42,200 ధర కాగా, రూ.39,200 సబ్సిడీ అందజేస్తోంది.
- లబ్ధిదారు రూ.1,03,000లు, స్త్రీనిధి ద్వారా రూ.లక్ష రుణం అందిస్తుండగా, మిగతా రూ.3వేలు చెల్లించాల్సి ఉంటుంది.
- 3కిలో వాట్ల యూనిట్‌కు రూ.1,92,360 కాగా, రూ.57,360 సబ్సిడీతో పాటు స్త్రీనిధి కింద రూ.1.25 లక్షల రుణసాయం అందిస్తోంది. మిగతా రూ.10 వేలు లబ్ధిదారు చెల్లించాలి.
- 2 కిలోవాట్ల ప్లాంట్ ద్వారా రోజుకు 8 యూనిట్లు, 3 కిలోవాట్ ప్లాంట్‌తో రోజుకు 12 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది.
- గ్రామీణ ప్రాంతాల్లో వినియోగదారులు రోజుకు 5 నుంచి 6 యూనిట్లు మాత్రమే వినియోగించుకునే అవకాశం ఉంటుంది.
- నెలకు 150 నుంచి 180 యూనిట్ల వరకు మిగులు విద్యుత్ గ్రిడ్‌కు వెళ్తుంది.
- గ్రిడ్‌కు పంపిన విద్యుత్‌తో నిర్వాహకులకు అదనంగా ఆదాయం సమకూరుతుంది.
- ఒకసారి ప్లాంటు ఏర్పాటు చేస్తే ఐదేళ్ల వరకు నిరంతరాయంగా విద్యుత్ ఉత్పాదన అవుతుంది. సోలార్ ప్లేట్లకు 25 ఏళ్ల వరకు వారంటీ ఇవ్వనున్నారు.

అదనపు ఆదాయం

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకం మహిళా సంఘాల కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడనుంది. సోలార్ విద్యుత్ పర్యావరణ పరిరక్షణకు పాటుపడడంతో పాటు మిగులు విద్యుత్ విక్రయంతో అదనపు ఆదాయం వస్తుంది. రుణంగా తీసుకున్న మొత్తాన్ని వాయిదాల పద్ధతిలో చెల్లించే అవకాశముంటుంది.

– శ్రీనివాస్, స్త్రీనిధి ఆర్ఎం

న్యూస్‌రీల్

ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు

ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా ప్రజలకు రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు మహా శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. స్వామివారి అనుగ్రహంతో సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలని కోరారు. కాళేశ్వరం జలాలతో రైతులకు సాగు నీరు ఇచ్చి వారి కళ్లల్లో ఆనందం చూడడం సంతృప్తిని ఇచ్చిందన్నారు. శివరాత్రిని ప్రజలంతా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, ఆ పరమేశ్వరుని అనుగ్రహంతో రాష్ట్రం సుభీక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

మొక్క నాటి.. గ్రీటింగ్స్



సీఎం వ్యవసాయక్షేత్రంలో మొక్క నాటుతున్న మంత్రి, ఎంపీ, ప్రజాప్రతినిధులు

మర్కూక్(గజ్వేల్): సీఎం కేసీఆర్ 69వ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలో సీఎం వ్యవసాయక్షేత్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ సంతోష్‌రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మొక్కలు నాటారు. అంతకు ముందు సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్ ఉన్నారు.

బకాయిలు చెల్లించాలి

జిల్లా రవాణాశాఖ అధికారి దుర్గాప్రసాద్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా పరిధిలోని వాహనదారులు వాహనాలకు సంబంధించిన పన్నులను సకాలంలో చెల్లించాలని జిల్లా రవాణాశాఖ అధికారి దుర్గాప్రసాద్ తెలిపారు. బకాయి వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నమని, పన్ను చెల్లించని వాహనదారులు తనిఖీల్లో పట్టుబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. దళితబంధు పథకంలో పొందిన వాహనాలతో పాటు చిన్నా, పెద్ద రవాణా వాహనాలపై సుమారు రూ.6 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. తక్షణమే బకాయిలను చెల్లించాలని, లేకపోతే 100 నుంచి 200 శాతం వరకు జరిమానా విధిస్తామన్నారు.

క్యాంపులో బర్త్ డే సెలబ్రేషన్స్



కేక్ కట్‌చేస్తున్న అసమ్మతి కౌన్సిలర్లు

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించి క్యాంపునకు వెళ్లిన అసమ్మతి కౌన్సిలర్లు శుక్రవారం సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్ కట్ చేసి సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు.

కాస్మొటిక్ చార్జీలను పెంచాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

మిరుదొడ్డి(దుబ్బాక): వసతి గృహాల్లో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మెస్ చార్జీలతో పాటు కాస్మొటిక్ చార్జీలను పెంచాలని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎస్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రం మిరుదొడ్డిలో బీసీ, ఎస్సీ హాస్టళ్లను శుక్రవారం ఆయన సందర్శించారు. డైనింగ్ హాల్, వంట గదులు, బాత్‌రూంలను పరిశీలించి, విద్యార్థులకు కల్పిస్తున్న మౌళిక వసతులపై విద్యార్థులతో మాట్లాడారు. గురుకులాల ఏర్పాటు తర్వాత ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లపై వివక్ష చూపిస్తోందని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ చార్జీలను పెంచలేదని విమర్శించారు. ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు డిసెంబర్ నెల చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని అన్నారు. సంక్షేమ హాస్టల్‌లో బాలికలకు రూ.200, బాలురకు రూ.150 కాస్మొటిక్ చార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న శంకర్

కాళేశ్వరంతో రాష్ట్రం సస్యశ్యామలం



మోటార్ల వద్ద పూజలు చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

- ఏడాదంతా చెరువుల్లో నీరు
- జీవనదిగా కూడవెల్లి
- దుబ్బాక కాలువకు నీటి విడుదల కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు

తొగుట(దుబ్బాక): దేశానికి సీఎం కేసీఆర్ నాయకత్వం వహించేలా రాష్ట్ర ప్రజలు దీవించాలని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. కొమురవెల్లి మల్లన్న సాగర్ నుంచి దుబ్బాక కాలువలోకి కాళేశ్వరం నీటిని శుక్రవారం ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మతో కలిసి విడుదల చేశారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పోరాడి తెలంగాణ రాష్ట్రం తేకుంటే కాళేశ్వరం నీటిని చూసేవారమేనా అన్నారు. కాళేశ్వరం నీటితో కూడవెల్లి వాగు జీవనదిలా మారిందని, దుబ్బాక నియోజకవర్గంతో పాటు సిద్దిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, మండలాలకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. తాగునీటి కోసం తల్లడిల్లిన ప్రాంతంలో మండు వేసవిలో సైతం చెరువులు కళకళలాడుతున్నాయన్నారు. యాసంగిలో 10వేల ఎకరాల్లో పంటను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ ప్రాంతంలో 257 చెరువులుండగా ప్రస్తుతం 91 చెరువులను నీటితో నింపనున్నట్లు పేర్కొన్నారు. రామాయంపేటకు సైతం కాళేశ్వరం జలాలు కాలువల ద్వారా వదులుతామన్నారు. గజ్వేల్, చేగుంటకు నీరు అందిస్తామని తెలిపారు. యూనిట్‌కు రూ.25 నుంచి రూ.30 చెల్లించి కరెంట్ కొనుగోలు చేస్తున్నామని, రైతులు నీటిని, కరెంట్‌ను వృథా చేయొద్దని కోరారు. ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం రూ.50వేల కోట్లు ఖర్చు చేస్తోందని స్పష్టం చేశారు. రూ.65వేల కోట్లతో రైతుబంధు, రూ.53వేల కోట్లతో రైతు బీమా పథకాలకు ఖర్చు చేస్తున్నామని, రైతులు పండించిన ధాన్యం దళారుల పాలుకాకుండా రూ.2వేల కోట్లతో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ తెలంగాణలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, ఈ పథకాలు భారత దేశ ప్రజలకు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ హరిరాం, డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య, దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరానికి బోయినిపల్లి బాలికల ఆశ్రమ పాఠశాల 5వ తరగతి వాటర్ స్పోర్ట్స్ కోర్సు ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఫిరంగి తెలిపారు. కాయకింగ్, కెనోయింగ్, సెయిలింగ్, తదితర వాటర్ స్పోర్ట్స్‌లో శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. 10 మంది బాలికలు, 10 మంది బాలురకు అవకాశం ఉందని, ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 23వ తేదీ లోగా జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆటో స్టార్టర్లు తొలగించాలి



రత్నాచారి, ఏడీఈ

చేర్యాల(సిద్దిపేట): రైతులు వ్యవసాయ పొలాల వద్ద మోటార్లకు ఏర్పాటు చేసిన ఆటో స్టార్టర్లను తొలగించాలని ఏడీఈ రత్నాచారి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా అందిస్తున్నామని తెలిపారు. యూనిట్ ధర రూ.10 నుంచి రూ.14ల చొప్పున నెలకు రూ.1500కోట్లు విద్యుత్ సంస్థ వెచ్చించి ప్రతీనెలా ప్రభుత్వం విద్యుత్ సరఫరా చేస్తోందన్నారు. ఆటో స్టార్టర్లతో విద్యుత్ వృథా అవుతుందని, ప్రభుత్వానికి ఖర్చు కూడా పెరుగుతుందని అన్నారు. రైతులు గమనించి ఆటో స్టార్టర్లు తీసివేయాలని కోరారు.

కారణజన్ముడు కేసీఆర్



మంత్రి క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మంత్రి హరీశ్ రావు, జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు

ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు

సిద్దిపేటజోన్: సీఎం కేసీఆర్ కారణజన్ముడని, ప్రజల తలరాతలు మార్చిన మహోన్నత వ్యక్తి అని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. శుక్రవారం సీఎం కేసీఆర్ 69 పుట్టినరోజు సందర్భంగా క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కే.. అంటే కారణజన్ముడని, సి..అంటే చిరస్మరణీయుడని, ఆర్.. అంటే మన తలరాతలు మార్చిన గొప్ప వ్యక్తి.. అని కొత్త నిర్వచనం చెప్పారు. తెలంగాణ ప్రజల బతుకుకు భరోసా, ధైర్యాన్ని ఇచ్చి ఆత్మ గౌరవంతో బతికేలా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, కార్యక్రమాలు యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి వచ్చారని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత వేణుగోపాల్ రెడ్డి, నర్సింగ్ కౌన్సిల్ సభ్యుడు సాయిరాం, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, పట్టణ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, కౌన్సిలర్లు తిరుమాల్, మల్లికార్జున్, ఆనంద్, ఎల్లం వజీర్, మోహిజ్, విఠోభ, సుందర్, బుచ్చిరెడ్డి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరికలు..

దుబ్బాకటౌన్: బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం దౌల్తాబాద్ మండలం ముత్యంపేట సర్పంచ్ బండి రాజు, ఉపసర్పంచ్ స్వప్నశేఖర్, మిరుదొడ్డి మండలం చెప్యాల సర్పంచ్ లక్ష్మి యాదగిరి తదితరులు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు మాటలపై నమ్మకం పోయిన నాయకులు బీజేపీని వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎంపీ ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు.

మహాశివరాత్రికి సర్వం సిద్ధం

- ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు
- కొనుగోళ్లతో సందడిగా మార్కెట్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహాశివరాత్రి వేడుకలకు జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల ఆలయాలు సిద్ధయ్యాయి. పరమ శివునికి ప్రత్యేక పూజలు చేసేందుకు ఆలయాల నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని ఉమాపార్థీశ్వర కోటిలింగాల ఆలయం, శ్రీ శరభేశ్వర ఆలయం, పార్వతీ దేవి ఆలయం, శివాలయం, శైవ, వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లు శుక్రవారం భక్తులతో సందడిగా మారాయి. మహాశివరాత్రికి ఉపవాసాలు ఉండే భక్తులు పండ్లు, పూలు, కూరగాయలను అధికంగా కొనుగోలు చేశారు. ఉత్సవాలు పురస్కరించుకుని పట్టణంలోని ఉమాపార్థీశ్వర కోటిలింగాల ఆలయంలో లక్ష రుద్రార్చన కార్యక్రమం నిర్వహించారు. శనివారం లింగోద్భవ అభిషేకాలు, ఉమామహేశ్వర కల్యాణం తదితర పూజలు నిర్వహించనున్నారు. పట్టణంలోని వేములవాడ కమాన్ వద్ద కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సోమనాథ్ ఆలయ నమూనాను పోలిన సెట్టింగ్‌ను సిద్ధం చేశారు. అనఘ సహిత దత్తాత్రేయ కల్యాణం, శ్రీ వేంకటేశ్వర కల్యాణం, ఉమామేశ్వర కల్యాణం, అహోరాత్రాభిషేకాలు, తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ బాధ్యులు కోరారు.



ఉమాపార్థీశ్వర కోటిలింగాల ఆలయంలో లక్ష రుద్రార్చనలో భక్తులు



సోమనాథ్ ఆలయ నమూనా



సిద్దిపేట మార్కెట్‌లో సందడి

నేడే మల్లన్న పెద్దపట్నం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం మహాశివరాత్రి పర్వదిన వేడుకలకు సిద్ధమైంది. మహాశివరాత్రిని పురస్కరించుకొని భక్తులు మల్లన్నను దర్శించుకునేందుకు భారీగా తరలి రానున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. శివరాత్రి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, నిరంతరం అభిషేకాలు చేయనున్నారు. ఒగ్గుపూజారుల ఆధ్వర్యంలో తోటబావి ప్రాంగణంలో పెద్దపట్నంవేసి స్వామి వారికి కల్యాణం నిర్వహించనున్నారు.

ప్రత్యేకం.. మల్లన్న పెద్దపట్నం


మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆలయ తోట బావి ప్రాంగణంలో వేసే పెద్ద పట్నానికి ప్రత్యేక విశిష్టత ఉంది. మల్లికార్జునస్వామి వీరశైవుల ఆడబిడ్డ మేడలాదేవితో పాటు యాదవుల ఆడపడుచు గొల్లకేతమ్మను పరిణయమాడిన సమయంలో స్వామి వారికి ఇక్కడ రెండు రకాలుగా పూజలు చేయడం ఆనవాయితీ. వీరశైవులు బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా వేద మంత్రోచ్ఛరణల మధ్య యాదవ పూజారుల ఆచారం ప్రకారం శివరాత్రి రోజు పంచవర్ణాలతో పట్నం వేసి కల్యాణం జరిపిస్తారు. పసుపు, కుంకుమ, తెల్లపిండి, సునేరు, పచ్చలను సమ్మేళనంతో నిమ్మకాయలతో చిత్రకన్ను నెలకొల్పి 41 వరుసల్లో పట్నం వేస్తారు. పట్నం వేసే ముందు ఒగ్గుపూజారులు స్వామి వారిని పల్లకిలో ఊరేంపుగా తీసుకెళ్లి కోనేటిలో స్నానమాచరింప జేసి, గంగాదీపం పెట్టి, గంగతెప్ప వదులుతారు. మల్లన్న, కేతమ్మ, మేడలాదేవికి నూతన వస్త్రాలను సమర్పించి సుంకు పడతారు. అనంతరం గొంగళిలో బియ్యం పోసి మైలపోలు తీస్తారు. స్వామి వారు ధరించే త్రిశూలం, ఢమరుకాలను నెలకొల్పిన అనంతరం పెద్దపట్నం పైకి ఆవాహనం చేస్తారు. నలువైపుల గుమ్మడికాయలతో బలిహరణ చేస్తారు. తెల్లవారుజామున గర్భాలయం నుంచి వీరశైవ అర్చకులు ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చి పెద్ద పట్నం చుట్టూ ప్రదక్షిణలు చేసి పట్నం తొక్కడం ప్రారంభించి, మల్లన్నను స్మరిస్తూ భక్తులు పట్నం దాటుతారు.



తోటబావి ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

తోటబావి వద్ద బారికేడ్లు

మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో నిర్వహించే పెద్దపట్నం చూసేందుకు వచ్చిన భక్తులు పెద్ద పట్నం తొక్కడం ఆనవాయితీ. దీనికి అనుగుణంగా ఆలయ అధికారులు ఆలయ ప్రాంగణంలో బారికేడ్లను ఏర్పాటు చేశారు. పెద్దపట్నం నిర్వహించే తోట బావి ప్రాంగణం, ఆలయ పరిసరాల్లో విద్యుత్ దీపాలతో రంగురంగుల స్వాగత తోరణాలు పెట్టారు. ఆలయ ఈఓ బాలాజీ, చైర్మన్ గీస భిక్షపతి, ఏఈఓ అంజయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



స్వామి వారి మూల విరాట్

క్లుప్తంగా

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

నారాయణఖేడ్: పట్టణంలోని పెట్రోల్‌బంకులో జరిగిన చోరీ కేసులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఖేడ్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మహాలక్ష్మి హెచ్‌పీ పెట్రోల్‌బంకులో ఈనెల 13వ తేదీన దొంగతనం జరిగిన విషయం తెలిసిందే. బంకులో సీసీ ఫుటేజీ, సాంకేతికత ఆధారంగా చోరీచేసిన మెదక్ జిల్లా హవేళిఘన్‌పూర్ మండలం మద్దుల్‌వాయికి చెందిన గజ్జెల బిక్షపతి అలియాస్ నవీన్‌కుమార్‌గా గుర్తించి అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రెండు ఫోన్లు స్వాధీనం చేసుకొని నిందితుడు వచ్చిన కారును సీజ్ చేశారు. నిందితుడిపై ఇదివరకే మెదక్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మూడు, సైబరాబాద్ పరిధిలోని అల్వాల్ ఠాణాలో ఒక చోరీ కేసు ఉంది. నాలుగు పర్యాయాలు జైలుకు వెళ్లి వచ్చాడు. నిందితుడిని ఖేడ్ కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ చెప్పారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

చేగుంట(తూప్రాన్): తాళం వేసిన ఇంట్లో దొంగతనం జరిగింది. ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం చేగుంట స్టేషన్‌రోడ్డులో నివాసం ఉంటున్న మ్యాకల మహేశ్ కుటుంబీకులు బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లారు. శుక్రవారం మహేశ్ ఇంటి తాళం పగులగొట్టి ఉండటం స్థానికులు గమనించారు. పోలీసులతో పాటు మహేశ్‌కు సమాచారం ఇచ్చారు. గ్రామానికి చేరుకున్న మహేశ్ దొంగతనంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు వచ్చి పరిశీలించారు. ఇంట్లో ఉంచిన 12 గ్రాముల బంగారంతో పాటు రూ. 5వేల నగదు పోయిందన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత


నగదు అందిస్తున్న మిత్రులు

చేర్యాల(సిద్దిపేట): కొంత కాలం క్రితం మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి తోటి మిత్రులు చేయూత అందించారు. స్థానిక పెద్దమ్మగడ్డ బాలుర పాఠశాలలో 1995–96లో పది చదివిన పట్టణ కేంద్రానికి చెందిన కె.రమేశ్ కొంత కాలం క్రితం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఇటీవల నిర్వహించిన పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో మిత్రులంతా కలిసి తీసుకున్న నిర్ణయం మేరకు రమేశ్ కుటుంబానికి రూ.15 వేలు నగదు శుక్రవారం అందించారు. కార్యక్రమంలో మిత్రులు పిల్లి రాజు, జిల్లా అజయ్‌కుమార్, ఇలిటం పెంటయ్య, బొడ్డు జగన్నాథం, పోతుగంటి ప్రసాద్, పోగుల యాదగిరి, బాలకృష్ణ, రవీందర్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి నిర్ణయం


ఏకగ్రీవ పత్రం అందజేస్తున్న సర్పంచ్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల పరిధిలోని గొల్లపెల్లిలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ప్రజలు ఏకగ్రీవంగా నిర్ణయించారు. శుక్రవారం ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డిను కలిసి గ్రామ సర్పంచ్ భానోతు రవీందర్ ప్రజల ఏకగ్రీవ పత్రాన్ని అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల అభిప్రాయం మేరకు త్వరలో గొల్లపెల్లిలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చెర్వుముందుతండా, గొల్లపెల్లి, లచ్చానాయక్ తండా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మహాదేవుని నెలవు.. శనీశ్వరుని కొలువు

- నేడు మహాశివరాత్రి, శనిత్రయోదశి
- అభిషేకాలు..తైలాభిషేకాలు చేయనున్న భక్తులు

వర్గల్(గజ్వేల్): ఒకేరోజు రెండు విశిష్టతలున్న నేపథ్యంలో వర్గల్ శంభునిగిరిపై ఆధ్యాత్మికత వెల్లివిరియనుంది. శనివారం మహాశివరాత్రి నేపథ్యంలో అభిషేకాలు, శనిత్రయోదశిలో భాగంగా తైలాభిషేకాలు చేయడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

స్వయంభువుగా శంభులింగేశ్వరుడు


వర్గల్ కొండగుహలో శంభులింగేశ్వరుడు

శంభుని కొండగుహలో స్వయంభువుగా వర్గల్ శంభులింగేశ్వరుడు వెలసిన ఆలయమిది. పురాతన ప్రాశస్త్యం కలిగిన శైవక్షేత్రాల్లో ఒకటిగా, శ్రీశైలం అంతటి మహిమాన్విత క్షేత్రంగా విరాజిల్లుతోంది.

- కాశీ విశ్వేశ్వర క్షేత్రం మాదిరి లింగాకృతిలో వెలసిన శంభులింగేశ్వరుడు, ఆ పక్కనే కొండ గుహలో పాలగుండం ఉంది.
- ఆలయం వెనకవైపు కాలభైరవుడు, ఎదురుగా స్మశానవాటికతో కాశీ క్షేత్ర లక్షణాలు గోచరిస్తాయి.
- శివానుగ్రహం పొందేందుకు పూర్వం ఇక్కడ మునులు తపమాచరించినట్టు ప్రతీతి.
- మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెల్లవారుజామున 4.30 గంటలకు గణపతిపూజ, ఉదయం 8 గంటల వరకు ఏకాదశ రుద్రం, అఖండ శివ నామస్మరణ జరుగుతుందని ఆలయ అర్చకుడు వీరభద్రయ్య తెలిపారు.
- రాత్రి 10 గంటలకు శివపార్వతుల శోభాయాత్ర, అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో మహా రుద్రాభిషేకం, బిల్వార్చనలు, భజనాది కార్యక్రమాలు జరుగుతాయి.

అరుదైన శనీశ్వరాలయం


వర్గల్ క్షేత్రంలో శనీశ్వరుడు

శనిత్రయోదశి మహోత్సవానికి వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని శనీశ్వరాలయం ముస్తాబైంది. రాష్ట్రంలోనే అరుదైన శనీశ్వరాలయాలలో వర్గల్ ఆలయం ఒకటి. శనిత్రయోదశి పర్వదిన వేళ ఇక్కడకు భక్తులు పోటెత్తుతారు. త్రయోదశితో కూడిన శనివారం రోజున శనీశ్వరునికి తైలాభిషేకం జరిపితే శనిదోషం తొలగిపోతుందని భక్తుల విశ్వాసం. భక్తుల సామూహిక తైలాభిషేకాలకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖరసిద్ధాంతి చెప్పారు.

- ఉదయం 5.30 గంటలకు గణపతి పూజ, శనీశ్వర మూలమంత్ర జపం, తర్పణం, హోమం, పూర్ణాహుతి తదితర పూజాకార్యక్రమాలు నిర్వహిస్తారు.
- శనీశ్వరునికి ప్రత్యేక పూజలు, భక్తుల సామూహిక తైలాభిషేకాలు కొనసాగుతాయి.
- రూ.250 చెల్లించి భక్తులు సామూహిక తైలాభిషేకంలో పాల్గొనవచ్చు. అవసరమైన పూజాసామగ్రి, పూజా ద్రవ్యాలను ఆలయంలో ఉచితంగా అందజేస్తారు.


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నాగ్సాన్‌పల్లిలో కార్డన్ సెర్చ్

ఏడు బైక్‌లు, రెండు ఆటోలు స్వాధీనం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని నాగ్సాన్‌పల్లిలో నర్సాపూర్ సీఐ షేక్ లాల్‌మధర్, కౌడిపల్లి ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని ఏడు బైక్‌లు, రెండు ఆటోలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సెకండ్ హ్యాండ్ వాహనాలు, సెల్‌ఫోన్లు కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. సరైన ధ్రువపత్రాలు లేనివి, చోరీ చేసిన వాటిని కొనుగోలు చేయొద్దని సూచించారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని.. ఓటీపీ మెసేజ్‌లు ఇతరులకు చెప్పవద్దన్నారు. గ్రామాల్లో అనుమానితులు సంచరిస్తే తెలియజేయాలన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని.. సమస్యలుంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కౌడిపల్లి ఏఎస్ఐలు శ్రీనివాస్, విఠల్ పోలీసులు పాల్గొన్నారు.

ఇసుక లారీలు సీజ్



రాయికోడ్(అందోల్): ఇసుకను తరలిస్తున్న మూడు లారీలను సీజ్ చేసినట్టు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని నాగ్వార్ చౌరస్తా వద్ద ఏఎస్ఐ ఇక్బాల్ హుస్సేన్, సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. అనుమానాస్పదంగా సిరూర్ వైపు నుంచి రాయికోడ్ వైపు వెళుతున్న మూడు లారీలను ఆపి తనిఖీ చేశామన్నారు. వాటిలో ఇసుక ఉందని, సంబంధిత పత్రాలు ఇవ్వాలని డ్రైవర్లను అడగ్గా, వారి వద్ద ఏమీ లేకపోవడంతో పంచనామా నిర్వహించి లారీలను రాయికోడ్ పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. విచారణలో లారీ ఓనర్లకు తెలియకుండానే అక్రమంగా ఇసుకను తరలించి జహీరాబాద్, బీదర్ పట్టణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు గుర్తించామన్నారు. కర్ణాటకలోని హుమ్నాబాద్‌కు చెందిన రంజిత్, బీదర్‌కు చెందిన సాదిక్, జహీరాబాద్ మండలం మల్చెల్మ గ్రామానికి చెందిన అష్రఫ్‌లపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామన్నారు.

మహిళల పొదుపు రూ.77 లక్షలు


మహిళల పొదుపుపై అవగాహన కల్పిస్తున్న అధ్యక్షురాలు విజయ

హుస్నాబాద్ రూరల్: మండల పరిధిలోని గాంధీనగర్ మహిళల పొదుపు సంఘం పొదుపు సొమ్ము 21 ఏళ్లకు రూ.77 లక్షలు చేరాయి. శుక్రవారం 21 వార్షిక మహా సభ జరిగింది. 2002లో 20 మందితో ప్రారంభమైన పొదుపు సంఘం నేడు గ్రామంలోని 379 మందికి చేరింది. నెలకు రూ.50 పొదుపు చేస్తున్నారు. మహిళలు వారి కుటుంబాల అవసరాల కోసం స్వయం ఉపాధి కోసం తక్కువ వడ్డీకే రుణాలను పొంది సంఘ అభివృద్ధికి తోడ్పాడు అందివ్వడంతోపాటు వారి కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. సమావేశంలో సమతి అధ్యక్షురాలు విజయ, సంఘం అధ్యక్షురాలు పోలు కవిత, కార్యదర్శి పంతంగి మునీంద్ర సభ్యులు పాల్గొన్నారు.

సీసీ ఫుటేజీ ఆధారంగా విచారణ

వివాదాస్పదమవుతున్న పోలీసుల తీరు



మెదక్ మున్సిపాలిటీ: సీసీ ఫుటేజీ ఆధారంగా మెదక్ పోలీసులు జరిపిన తీరు ఇప్పుడు వివాదాస్పదమవుతోంది. మహిళ మెడలోంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన వ్యక్తికి, ఖదీర్‌కు దగ్గరి పోలికలు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు. 2015, 2019 జరిగిన చోరీ కేసుల్లో ఖదీర్ నిందితుడు కావడంతో, పోలీసులు ఖదీరే చైన్ స్నాచింగ్‌కు పాల్పడి ఉండవచ్చని కోణంలో ఇన్వెస్టిగేషన్ చేసినట్టు అర్థమవుతోంది. సంఘటన జరిగిన తర్వాత ఖదీర్ స్థానికంగా లేకపోవడంతోనే వారి అనుమానం మరింత బలపడింది. ఆ కోణంలోనే హైదరాబాద్‌కు వెళ్లి ఖదీర్‌కు తీసుకొచ్చారు. తీసుకొచ్చే సమయంలోనూ, ఆ తర్వాత కూడా పోలీసులు వ్యవహరించిన తీరుపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తామేమీ కొట్టలేదని, విచారణ నిమిత్తం తీసుకొచ్చి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని పోలీసులు చెబుతున్నారు. అయితే ఖదీర్ ఒంటిపై ఉన్న గాయాలపై పోలీసులు పెదవి విప్పడం లేదు. ఐదురోజులు కస్టడీలో ఉంచుకొని చిత్రహింసలు పెట్టారని ఖదీర్ కుటుంబసభ్యులు ఆరోపిస్తుండగా, ఫిబ్రవరి 3వ తేదీన విచారించి వదిలేశామని, 6వ తేదీన ఆస్పత్రిలో చేరారనేది పోలీసుల వాదన. మెరుగు చికిత్స నిమిత్తం ముందుగా హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పోలీసులే చేరిృంచారని, ఖర్చులు కూడా వారే భరించామని ఖదీర్ భార్య చెబుతోంది. అయితే దీనిపై పోలీసులు మాత్రం స్పందించడం లేదు.

ఖదీర్ మృతిపై రాష్ట్ర, జాతీయ మానవహక్కుల కమిషన్, జాతీయ మైనార్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు మైనార్టీ నాయకులు తెలిపారు. ఖదీర్ భార్యతో కలిసి ఎస్పీని కలిసిన వారిలో కౌన్సిలర్ సమీయొద్దీన్, మాజీ కౌన్సిలర్ సోహైల్, టీడీపీ నాయకులు అఫ్జల్, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరి మ్యాడం బాలకృష్ణ, మైనార్టీ నాయకులు హఫిజ్, రియాజ్, ఖాలేద్, తహేర్, బాంబే ఆరీఫ్, ఫసీ, హైమద్, మైసన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వాలి

జోగిపేట(అందోల్): ప్రభుత్వం అందిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులైన వారికే ఇవ్వాలని అందోలు నియోజకవర్గ బీఎస్పీ నాయకుడు ముప్పారం ప్రకాశం అన్నారు. శుక్రవారం అందోలు తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్, ఇన్‌చార్జి శ్రీధర్‌రాజ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, నాయకులు పద్మారావు, కుమార్ గౌడ్, మధు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం..మండల పరిధిలోని లక్డారం గ్రామానికి చెందిన అవినాష్(28) పక్కింటి వారు తెచ్చి పెట్టిన ట్రాక్టర్ను చెప్పకుండా తీసుకొని వెళ్లాడు. ఈక్రమంలో గ్రామ సమీపంలోని చెరువు అలుగు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడి అవినాష్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శోభయాత్రలో పాల్గొనాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న సంఘాల నాయకులు

నారాయణఖేడ్: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 19న ఖేడ్ పట్టణంలో నిర్వహించనున్న శోభయాత్రలో పాల్గొనాలని కోరుతూ శుక్రవారం విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్ జిల్లా నాయకులు ప్రశాంత్, జగదీష్, సంతోష్, నీలేష్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఎంబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ రోషన్‌రెడ్డిలను విజ్ఞప్తి చేశారు. ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసి శోభయాత్రకు సంబంధించిన కరపత్రాలను అందించారు.

ఆటో స్టార్టర్లు తొలగించాలి

మెదక్ కలెక్టరేట్: వ్యవసాయానికి అవసరం మేరకు రోజుకు 10 నుంచి 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని మెదక్ ట్రాన్స్‌కో ఎస్ఈ జానకిరాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు వ్యవసాయ మోటార్ల నుంచి ఆటో స్టార్టర్లను స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు. జిల్లాలో 1.12 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. వరి పంటకు విద్యుత్ సరిపోతుందని.. రైతులు అవసరం మేరకు వినియోగించుకోవాలన్నారు. ఏడుపాయల్లో కరెంట్ నియంత్రణ ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఆటో స్టార్టర్ల ద్వారా విద్యుత్ వృథా అయ్యే అవకాశం ఉందన్నారు. ఉచిత విద్యుత్ కోసం టీఎస్‌పీడీసీఎల్ యూనిట్‌కు రూ.12 చొప్పున రూ.1500 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. నీటి అవసరం ఉన్నప్పుడు వెళ్లి మోటార్ల ఆన్ చేసుకొని, మిగితా సమయంలో నిలిపివేయాలని రైతులకు సూచించారు.

రోగులకు పండ్ల పంపిణీ


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైద్యులు

మెదక్ జోన్: సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సూపరింటెండెంట్ పీసీ శేఖర్, వైద్యులు కిరణ్, చంద్రశేఖర్ రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీసీ శేఖర్ మాట్లాడుతూ.. వైద్యాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

పుల్‌కల్‌లో

పుల్‌కల్(అందోల్): ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పుల్‌కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఎంపీపీ చైతన్య విజయ్‌భాస్కర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ యాదగిరిరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్ చారి పాల్గొన్నారు.

మునిపల్లిలో...

మునిపల్లి(అందోల్): ఎంపీపీ శైలజా శివశంకర్, జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. శుక్రవారం మండలంలోని మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయా గ్రామాల రోగులు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు.


గౌతం జూనియర్ కాలేజ్ జట్టు


ఎంవీఎస్ గవర్నమెంట్ ఆర్ట్స్, సైన్స్ కాలేజ్ జట్టు

హోరా హోరీగా ఫైనల్స్

- 'సాక్షి' ప్రీమియర్ లీగ్ రీజినల్ విన్నర్‌గా భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్ సైనిక్‌పురి జట్టు
- జూనియర్ విజేతగా గౌతం జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్


విజేతగా నిలిచిన భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్ జట్టు


ఘట్‌కేసర్: మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా, ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో 'సాక్షి' మీడియా గ్రూపు ఆధర్యంలో నిర్వహిస్తున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్ మహబూబ్‌నగర్, గ్రేటర్ హైదరాబాద్ రీజినల్ సీనియర్, జూనియర్ ఫైనల్ మ్యాచ్‌లు శుక్రవారం హోరాహోరీగా జరిగాయి.


సీనియర్ విభాగంలో ఎంవీఎస్ గవర్నమెంట్ ఆర్ట్స్, సైన్స్ కాలేజ్ మహబూబ్‌నగర్, భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్ సైనిక్‌పురి జట్లు రీజినల్ లెవల్‌లో తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఎంవీఎస్ గవర్నమెంట్ ఆర్ట్స్, సైన్స్ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. డేవిడ్ 29 బంతుల్లో 56 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన భవాన్స్ డిగ్రీ కాలేజ్ జట్టు 8.3 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 105 పరుగులు చేసి మహబూబ్‌నగర్, గ్రేటర్ హైదరాబాద్ రిజినల్ సీనియర్ విభాగంలో విజేతగా నిలిచింది. జట్టులో నితీశ్ 32 బంతుల్లో 72 పరుగులు చేసి విజయంలో కీలక పాత్ర పోషించాడు.

జూనియర్ విభాగంలో గవర్నమెంట్ జూనియర్ కాలేజ్

(బాలురు) మహబూబ్‌నగర్, గౌతం జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ జట్టు 9 ఓవర్లతో 10 వికెట్లు కోల్పోయి 62 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గౌతం జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్టు 5.4 ఓవర్లతో 3 వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసి మహబూగర్‌నగర్, గ్రేటర్ హైదరాబాద్ రీజినల్ జూనియర్ విన్నర్స్‌గా నిలిచారు. గౌతం క్రీడాకారుడు మనీశ్ 3 వికెట్లు తీయగా, అసిలేశ్ 7 బంతుల్లో 19 పరుగులు, అన్విత్ 10 బంతుల్లో 18 పరుగులు చేశారు. రీజినల్ విన్నర్స్, రన్నర్స్, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా విజేతలకు ఈవెంట్స్ ఏజీఎం ఉగ్రగిరిరావు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు.

ఘనంగా స్వయం పాలన


ఉపాధ్యాయులతో విద్యార్థులు


బందారం హైస్కూల్‌లో

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గంగాపూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. బోధనలో ప్రతిభ చూపిన వారికి ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగారెడ్డి, హెచ్‌ఎం భూమయ్య, ఉపాధ్యాయులు పరమేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, రజిత, విద్యాకమిటీ చైర్మన్ సాయిలు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఐలయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని చెప్యాల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం జరుపుకున్నారు. డీఈఓగా జోసఫ్, ఎంఈఓగా సాయి చరణ్, ప్రధానోపాధ్యాయుడిగా ప్రణయ్ వ్యవహరించారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతె ప్రాథమిక పాఠశాలలోనూ స్వయం పాలన జరుపుకున్నారు. చక్కగా పాఠాలు బోధించిన విద్యార్థులకు హెడ్ మాస్టర్ అబ్రహం, టీచర్లు రాములు, ముత్యంరెడ్డి, మంజుల, మమతలు బహుమతులు ప్రదానం చేశారు.

కొండపాక(గజ్వేల్): మండలంలోని బందారం గ్రామంలోని హైస్కూల్‌లో శుక్రవారం స్వయంపాలనా దినోత్సవాన్ని జరుపుకున్నారు. హెచ్ఎంగా అంజి, డీఈఓగా సాయికృష్ణ, ఉపాధ్యాయులుగా రాకేష్‌రెడ్డి, కౌశిక్, రవళి, హారిక, పూజ, రాజు, అభిలాష్, వేణు, ఆంజనేయులు, దినేష్ వ్యవహరించారు. కార్యక్రమాన్ని హెచ్‌ఎం పెద్ది విఠల్, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

దుబ్బాక: విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. దుబ్బాక మండలం గోసాన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్‌ఎం ఆకుల లక్ష్మణ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దొండడి లక్ష్మీ పాల్గొన్నారు.